
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
శనివారం 10 మే 2025



రాష్ట్రంలో లిడ్‌క్యాప్‌లను ప్రారంభించాలి



మాట్లాడుతున్న దండోరా రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ మాదిగ

మందమర్రిటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉన్న ఏడు లిడ్‌క్యాప్‌లను ప్రభుత్వం ప్రారంభించి చర్మకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ మాదిగ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని లెదర్ పార్కును ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ లెదర్ పార్కు 2007లో చర్మకారులకు కేటాయించారని, లెదర్ వస్తువుల తయారీ కోసం పరికరాల ఏర్పాటు కోసం 25 ఎకరాల భూమిని కేటాయించారన్నారు. క్రమక్రమంగా భూమి అన్యాక్రాంతం అవుతుందన్నారు. 2009లో అప్పటి మంత్రి వినోద్ దీన్ని ప్రారంభించి వదిలేశారని, ఇంత వరకు దీన్ని ప్రారంభించలేదన్నారు. కేంద్రం 80 శాతం నిధులు, రాష్ట్రం 20 శాతం నిధులు కేటాయించి వెంటనే లెదర్ పార్కును ప్రారంభించి చర్మకారులకు స్థానికులకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్తూరి రమేష్, మోతె స్వామి, విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, సంగి సంతోష్, కనకయ్య, రవి, కుమార్, రాజమల్లు, జనార్దన్, వినోద, నిరోషా, లక్ష్మీ, శివ, కిరణ్ పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

హాజీపూర్, మే9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొనబండ గ్రామంలో శివరామాంజనేయ స్వామి ఆలయంలో జాతర మహోత్సవాలు ఐదురోజుల పాటు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా గురువారం రాత్రి శివపార్వతుల కల్యాణం కన్నులపండువగా సాగింది. శివాలయ ఆవరణలో పార్వతి పరమేశ్వరులకు పట్టు వస్త్రాలు, ముత్యాలు, వివిధ వజ్రాభరణాలతో అలంకరించారు. ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలతో తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు కల్యాణ మండపంలో వేదికపై ఉంచారు. అనంతరం వైభవంగా కల్యాణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పొలాస శ్రీశైలం, ముత్యాల రమాకాంత్‌శర్మ, అర్చక బృందం పాల్గొన్నారు.

హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌కు ఘన స్వాగతం



తెలంగాణ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : టూర్‌ప్రోగ్రామ్‌లో భాగంగా జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ గెస్ట్ హౌజ్‌కు వచ్చిన హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్‌కు కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్ మొక్కను అందజేసి శుక్రవారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సింగరేణి అధికారులు, జిల్లా న్యాయమూర్తులను జిల్లా పరిస్థితుల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు.

పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలి



శంకర్‌పల్లిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

మందమర్రిరూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. శుక్రవారం మండలంలోని మామిడిగట్టు, శంకర్‌పల్లి గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్లను, మురికి కాలువలను శుభ్రంగా ఉంచాలన్నారు. మంచినీటి సమస్య లేకుండా చూడాలన్నారు. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని, నీరు పోయాలని సూచించారు. అనంతరం పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు సంధ్యారాణి, రాజేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గర్మిళ్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఏసీసీలోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రక టనలో తెలిపారు. జాఫర్‌నగర్, జన్మభూ మినగర్, ఇందిరానగర్, ఇక్బాల్ అహ్మద్ నగర్, హైటెక్ సిటీ, గ్రీన్ సిటీ, శ్రీనివాస గార్డెన్ ఏరియా, అండాలమ్మ కాలనీ, మారుతి నగర్, లక్ష్మీనగర్, ఇస్లాంపుర, రాళ్లపేట, గొల్లవాడ, సావిత్రినగర్, వికాస్‌నగర్ ప్రాంతాలకువిద్యుత్ ఉండదని తెలిపారు.

అడ్వయిజరీ కమిటీ మెంబర్‌గా శ్రీనివాస్

మంచిర్యాలక్రైం, మే9(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ జాతీయ సేవా పథకం అడ్వయిజరీ కమిటీ మెంబర్‌గా వివేకవర్ధిని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. శ్రీనివాస్ నియామకమయ్యారు. కేంద్ర ప్రభుత్వ, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయసేవా పథకం కాకతీయయూనివర్సిటీ అడ్వయిజరీ కమిటీ మెంబర్‌గా నియమితులయ్యారు. యూనివర్సిటీ స్థాయిలో నలుగురు ప్రిన్సిపాల్‌లకు అవకాశం ఉండగా అందులో ప్రభుత్వ కళాశాల ఇద్దరు ప్రిన్సిపాళ్లు, ప్రయివేటు కళాశాల ప్రిన్సిపాళ్ల ఇద్దరికి అవకాశం ఉండగా మంచిర్యాలకు చెందిన శ్రీనివాస్ నియమితులు అయ్యారు.

పోలీసుల పల్లె నిద్ర

భీమారం, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేరేడుపల్లిమద్దికల్ గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీసులు పోలీసులు పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. భీమారం ఎస్ఐ శ్వేత ప్రజలకు ట్రాఫిక్ నియమాలు, సైబర్ మోసాలు, బాల్య వివాహాలు, డయల్ 100, షీటీంల గురించి వివరించారు. గ్రామాల్లో ఎవరు కూడా గొడవలు, ఘర్షణలకు పాల్పడ వద్దని, అందరు కలిసి మెలిసి ఉండాలని సూచించారు. పోలీసులు పాల్గొన్నారు.

వేసవిలో పశువులను కాపాడుకుందాం..

- అధిక ఉష్ణోగ్రతలతో వడదెబ్బ ముప్పు
- జాగ్రత్తలు పాటించాలని నిపుణుల సూచన

7



'ఆదిమ' ప్రాంతాలకు ఆధునిక రహదారులు

- పీఎం జన్‌మన్‌లో రూ. 19.73 కోట్లు మంజూరు

6

అకాల వర్షం.. అపార నష్టం

- అన్నదాతపై వరుణుడి కన్నెర్ర
- చేతికి వచ్చిన పంట నీళ్లపాలు
- కల్లాల్లోనే తడిసి ముద్దయిన ధాన్యం
- మామిడి పంటకూ తీరని నష్టం



భీమారం మండలంలో కల్లాల్లోనే తడిసిన ధాన్యం (ఫైల్)

మంచిర్యాల, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులను నిలువునా ముంచింది. భారీ వర్షం కారణంగా కల్లాల్లో ఉన్న ధాన్యం మొత్తం నీటిపాలుకాగా అపార నష్టం వాటిల్లింది. ఓ వైపు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించి, రైతుల నుంచి ధాన్యం సేకరిస్తున్నా, వరుణుడి భారి నుంచి రైతు తప్పించుకో లేకపోయాడు. జిల్లాలో దాదాపుగా వరి కోతలు పూర్తి కావచ్చినప్పటికీ కల్లాల్లో ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. చేతిక వచ్చిన పంట నీళ్లపాలు కావడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంట ప్రకృతి వైపరీతం కారణంగా నీటిపాలుకాగా, రైతులకు కోలుకోలేని విధంగా నష్టాన్ని కలిగించింది. అలాగే మామిడి సైతం అకాల వర్షాలకు పెద్ద మొత్తంలో నేలరాలడంతో రైతులకు భారీ నష్టాన్ని మిగిల్చింది.

దిగుబడి వచ్చినా చేతికిరాని పంట...

జిల్లాలో గత సంవత్సరం యాసంగిలో 2లక్షల 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రాగా, ఈ సీజన్‌లో లక్షా 21,702 ఎకరాల్లో వరి పంట సాగైంది. ఇందులో దొడ్డు రకం లక్షా 14,774 ఎకరాలు కాగా, సన్న రకం 6928 ఎకరాల్లో సాగు చేయగా, 3,40,301 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నారు. ఇందులో దొడ్డు రకం 3,23,639 మెట్రిక్ టన్నులు కాగా, సన్నరకం ధాన్యం 16,662 మెట్రిక్ టన్నులు వస్తుం దని భావిస్తున్నారు. అయితే ఊహించని రీతిలో అకాల వర్షాలు కురవడంతో పంట నీళ్లపాలైంది. ధాన్యం తడ వకుండా రైతులు టార్పాలిన్, పాలిథిన్ కవర్లు కప్పి, తగు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ భారీ వర్షం కురవ డంతో మొత్తం తడిసి ముద్దయింది. కల్లాల్లో ఉన్న ధా న్యం బస్తాలు పూర్తిగా నీటిలో తడిసిపోయాయి.

చేతికి వచ్చిన పంట వర్షార్పణం...

గత నెల 30 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు కురిసిన అకాల వర్షాల కారణంగా చేతికి వచ్చిన పంట వర్షార్పణం అయింది. వరి పంటకు సంబంధించి నెన్నెల, భీమారం మండలాల్లో రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ఆయా మండలాల్లో 490 రైతులకు సంబంధించిన 862 ఎకరాల్లో పంట పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. మొత్తంగా 2 లక్షల పై చిలుకు మెట్రిక్ టన్నుల ధా న్యం నీటిపాలైనట్లు అంచనా. అలాగే మామిడి పంట కు సంబంధించి...

(తరువాయి 7లో)

రైతు ఆదాయం పెంచుకునేందుకు అవగాహన ఉండాలి

నస్పూర్, మే9 (ఆంధ్రజ్యోతి): భూసారం సంరక్షించుకునే విధంగా వాణిజ్య, ప్రత్యామ్నాయ పంటల సాగుచేసి అధిక ఆదాయం పొందే విధంగా రైతులు అవగాహన కల్పించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. నస్పూర్‌లోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాస్త్రీయ పంటలైన వరి ధాన్యం వంటి పంటలు మార్పు లేకుండా సాగుచేయడం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. పంట మార్పిడి విధానాన్ని అవలంబించడం వల్ల భూసారం పెరగడంతో పాటు భూగర్భజలాలు కూడ కాపాడుకోవచ్చన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

పప్పు ధాన్యాలు, మొక్కజొన్న, కూరగాయల సాగు, వాణిజ్య ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా అధిక దిగుబడితో ఆదాయం పొందడమే కాకుండా భూసారాన్ని కాపాడుకునే అవకాశం ఉంటుందన్నారు. పప్పుధాన్యాల పంట సాగులో దిగుబడి అంచనా వేసి అధిక మొత్తంలో ఉన్నట్లయితే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కనీసం మద్దతు ధరతో కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పామాయిల్ సాగుచేసే విధంగా రైతులను ప్రోత్సహించాలని, ప్రతిరోజు పంటసాగు ప్రక్రియను పర్యవేక్షించి ఆన్‌లైన్ నమోదు చేయాలని ఆదేశించారు. పంటల సాగులో సందేహాలు ఉంటే క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తిన ఉన్నతాధికారుల దృష్టికితీసుకెళ్లి పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి కల్పన, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి అనిత, మాట్రిక్స్ సీఈవో ఉదయ్‌కుమార్‌లతో పాటు వ్యవసాయశాఖ డివిజన్ అధికారులు, మండల అధికారులు, విస్తరణ అధికారులు, పట్టు పరిశ్రమశాఖ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా ధాన్యం కొంటాం

- జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్

దండేపల్లి,మే 9(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరిధాన్యంను కొనుగోలు చేస్తామని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ (డీఆర్‌డీవో) అధి కారి కిషన్ అన్నారు. దండేపల్లి మండల కేంద్రంలో పాటు నెల్కి వెంకటాపూర్ కర్ణపేట, మామిడిపల్లి, లింగాపూర్, నాగసముద్రం గ్రామాల్లో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకరావలన్నారు. ధాన్యం తెచ్చేటప్పుడు తాలు లేకుండా తేమశాతం తక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. రైతులు దళారులను నమ్మి మోస పోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొను గోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి



దండేపల్లిలో ధాన్యం పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కిషన్

కొనుగోలు కేంద్రంవద్ద తాగునీరు, నీడను కల్పించాలన్నారు. కేంద్రాలలో గన్నీ సంచుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు చూసుకోని లేకుంటే తెప్పించుకోవాలన్నారు. తూకం వేసి ధాన్యం బస్తాలను ఎప్పటిక ప్పుడు రైస్‌మిల్లుకు తరలించాలని, లారీల కొరత లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. లారీ అవసరం ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే లారీలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, ఐకేపీ ఏపీఎం భూపతి బ్రహ్మయ్య, జిల్లా సమైఖ్య అధ్యక్షురాలు అల్లంల అనిత, సీసీలు తిరుపతిగౌడ్, సురేందర్, లావణ్య, కోమురయ్య, వివోఏలు, గ్రామైఖ్య సం ఘాల లీడర్లు, సభ్యులు, రైతులు, హమాలీలు, పాల్గొన్నారు.

అందుబాటులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

- కలెక్టర్ కుమార్ దీపక్

భీమారం, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజల సౌకర్యార్థం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మిస్తున్నామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం భీమారం మండల కేంద్రంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను తహసీల్దార్ సదానందంతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం మండల కేంద్రం, మద్దికల్ గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి నిర్వహకులకు సూచనలు చేశారు. రైతుల వద్ద నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్‌లు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం అంకుశాపూర్, కొత్తపల్లి గ్రామపంచాయతీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. భూభారతి చట్టంలో భాగంగా భీమారం మండలాన్ని పైలెట్ మండలంగా ఎంపిక చేసి భూ సమస్యల దరఖాస్తులను స్వీకరించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. సాదాబైనామా దరఖాస్తులను కూడా పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సందర్శించారు. విద్యార్థులకు వివిధ రకాల అంశాల్లో ఉచితంగా శిక్షణ అందిస్తున్నామని దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండల కేంద్రంలోని సమగ్ర ఆగ్రో ఇండస్ట్రీస్ రైసుమిల్లును ప్రత్యేక తహసీల్దార్ కృష్ణతో కలిసి సందర్శించి నిర్వహకులకు పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

'ఉపాధి' కూలీల ఇక్కట్లు



ఎండలో ఉపాధి పనులను చేస్తున్న కూలీలు

- పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కరువు
- ఇబ్బందులు పడుతున్న కూలీలు

తాండూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో పనులకు వెళ్తున్న కూలీలకు పని స్థలాల వద్ద కనీస వసతులు కరువయ్యాయి. పని ప్రదేశాల్లో అధికారులు, సిబ్బంది సరైన వసతులు కల్పించకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. తాండూర్ మండలంలోని 15 గ్రామ పంచాయతీలు ఉండగా 7546 జాబ్ కార్డులు ఉన్నాయి. 4268 యాక్టివ్ జాబ్ కార్డులు పనిచేస్తుండగా 1600 మంది కూలీలు పనులు చేస్తున్నారు. పని ప్రదేశాల్లో కనీస వసతులు లేకపోవడంతో కూలీలు ఇబ్బందులు ప డుతున్నారు. ఎండలోనే పనులు చేయాల్సి వస్తుందని, పనులు చేసిన తర్వాత కొంత సేపు విశ్రాంతి తీసుకుందామనుకున్నా నీడ లేకపోవడంతో దూరంగా ఉన్న చెట్ల వద్దకు వెళ్లి సేద తీరుతున్నారు. కూలీలు ఎవరికి వారే తాగునీరు ఇంటి నుంచి తెచ్చుకుంటున్నట్లు తెలిపారు. ఆ నీరు కూడా ఉష్ణోగ్రతలకు వేడవుతున్నాయని తాగలేకపోతున్నామని కొందరు కూలీలు వాపోతున్నారు. పని ప్రదేశాల్లో నీడ, తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యా కెట్లు అందించాల్సి ఉండగా అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తుం డడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. పని ప్రదేశాల్లో గ్రామపం చాయతీ తరుపున నీటి సరఫరా కోసం ఒక వ్యక్తికి రోజుకు రెండున్నర రూపాయల చొప్పున ప్రభుత్వం అందజేస్తుంది. కానీ గ్రామపంచాయతీ సిబ్బంది అక్కడక్కడ నీటిని సరఫరా చేయకపోవడంతో కూలీలు ఇబ్బం దులు పడుతున్నారు. అలాగే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం ద్వారా పనిచేసే ప్రదేశంలో పనిచేసే ముందు పని తర్వాత ఫొటోలను తీసుకుని అప్‌లోడ్ చేసిన తర్వాతనే కూలీలు ఇంటి బాట పట్టాలి. లేదంటే హాజరు పడదని ఆదేశాలు ఉండడంతో ఉపాధి సిబ్బంది వచ్చే వరకు పని స్థలాల వద్దనే ఎండలో ఉంటున్నారు.

క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాల్సిన ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లు కార్యాలయానికే పరి మి తం అవుతున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అంతే కాకుండా కొన్ని ప్రాంతాల్లో పనులకు హాజరు కాని కూలీలకు కూడా మస్టర్లు వేస్తుండ డంతో పనులు చేసిన కూలీలు నష్టపోతున్నారు. ఎండలు ఇంకొన్ని రోజు లు ఇలానే ఉంటాయి కాబట్టి ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పని ప్రదేశాల్లో నీడ కోసం టెంట్లు, చల్లని తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు తదితర వసతులు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

ఎండలో పనులు చేస్తున్నాం..

- తిరుపతి, ఉపాధి కూలీ , గోపాల్‌నగర్



ఉపాధి హామీ పనులు చేసే చోట కూలీలకు ఎలాంటి వసతులు కల్పిం చడం లేదు. ఎండలో పనులు చేస్తున్నాం. పనులు చేసిన తర్వాత కొంత సేపు విశ్రాంతి తీసుకుందామనుకుంటే నీడ కూడా ఉండడం లేదు. కనీ సం తాగునీరు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. నీడ, తాగు నీరు, మెడికల్ కిట్‌లు అందుబాటులో ఉంచాలి.

నీటి వసతి కూడా లేదు ..

- అమురాల రవళి, కూలీ, అచ్చలాపూర్



ఉపాధి హామీ పనులు చేసే చోట కనీసం చల్లని తాగునీరు కూడా క ల్పించడం లేదు. దీంతో ఇంటి నుంచి తెచ్చుకున్న నీరు ఎండలకు వేడిగా మారుతంది. వేడినీటిని తాగలేకపోతున్నాం. నీడ సౌకర్యం లేకపోవడంతో ఎండలో పనులు చేస్తూ స్పృహ తప్పి పోతున్నాం. అధికారులు చల్లని నీ రు, నీడ సౌకర్యం కల్పించాలి.

ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం..

- నందకుమార్, ఏపీవో, తాండూర్



మండలంలో ఉపాధి హామీ కూలీలు పనిచేసే ప్రదేశాల్లో నీటి సరఫరా చేయాలని గ్రామ సెక్రటరీలకు చెప్పాం.

నీడ వసతి కల్పిస్తాం. కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం. మెడికల్ కిట్‌లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలాగా చూస్తాం.

వడదెబ్బతో మహిళ మృతి

కోటపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల కేంద్రానికి చెందిన కర్నాటకపు లక్ష్మి (66) అనే మహిళ వడదెబ్బ సోకి అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. స్థానిక ఐకేపీ కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ స్వీపర్‌గా లక్ష్మీ పనిచేస్తుంది. ఇటీవల ఆమె బంధువు మృతి చెందడంతో పరామర్శించేం దుకు వెళ్లిన లక్ష్మీ మూడు రోజుల క్రితం వడదెబ్బకు గురైంది. అప్పటి నుంచి తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను బంధువులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందింది.

గోయగాంలో 'బడిబాట'

కెరమెరి, మే 9 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలం గోయగాం జడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రమేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన కూడలిలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులకు, గ్రామ పెద్దలకు, స్వయం సహాయక సంఘాల సభ్యులను, యువకులకు పాఠశాలలో ఉన్న వసతులు, పూర్వ విద్యార్థి అనుభవాలను, నూతనంగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

'ఆదిమ' ప్రాంతాలకు ఆధునిక రహదారులు


అధ్వానంగా మారిన పాత దంతన్‌పల్లి రోడ్డు

పీఎం జన్‌మన్‌లో రూ. 19.73 కోట్లు మంజూరు

మొదటి విడతలో కుమరం భీం జిల్లాకు ప్రాధాన్యం

ఆసిఫాబాద్‌రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆదిమ గిరిజనులు (పీవీటీజీలు) అధికంగా నివసించే పల్లెలకు రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాకే ఈ నిధులు కేటాయించారు.

గిరిజనుల్లో కొలాం, తోటి కులస్తులు అధికంగా నివసించే చోట ఈ రహదారులు మంజూరయ్యాయి. త్వరలో ప్రారంభమయ్యే రహదారులతో ఈ పల్లె ప్రాంతాల కష్టాలు తొలగనున్నాయి. జిల్లాలో కొన్ని చోట్ల మట్టి రోడ్లు ఉండగా మరికొన్ని చోట్ల పాత రహదారులు అధ్వానంగా మారాయి. కల్వర్టుల నిర్మాణం లేక వర్షాకాలంలో రాకపోకలకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఇలా సమస్యలతో కొట్టు మిట్టాడుతున్న జిల్లాలోని ఎనిమిది గ్రామాలకు ఈ రహదారులను కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం, కేంద్రం 60 శాతం భాగస్వామ్యంతో చేపట్టే ఈ పనులు ఆయా గ్రామాలకు వరంగా మారనున్నాయి.

ఎనిమిది రోడ్లకు..

ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద జిల్లాలో ఎనిమిది రోడ్లుకు రూ. 19.73 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆసిఫాబాద్ మండలంలోని గోండుగూడ నుంచి మీసాల గూడ, కొమ్ముగూడ నుంచి సల్పలగూడ, పీఆర్ రోడ్డు నుంచి గంటలగూడ, పీఆర్ రోడ్డు నుంచి దానాపూర్, పర్శనంబాల నుంచి పాతరౌట, బనార్‌గోంది నుంచి కొలాంగూడ, తిర్యాణి మండలంలోని జడ్పీ రోడ్డు నుంచి పాత దంతన్‌పల్లి, వాంకిడి మండలంలోని పీఆర్ రోడ్డు నుంచి మన్నెగూడ వరకు రోడ్లు మంజూరయ్యాయి.

కొత్త సాంకేతికతతో..

సాధారణంగా చేపట్టే సీసీ రోడ్డు, బీటీ రోడ్ల తరహాలో కాకుండా కొత్త సాంకేతికతను అందిపుచ్చుకొని ఈ పనులు చేపట్టాలని సూచించారు. నిరుపయోగంగా పడేసి ఉండే ప్లాస్టిక్‌ను బీటీ (డాంబర్) రహదారుల నిర్మాణంలో వినియోగించాలని సూచించారు. కాకపోతే ఆ ప్రాంతంలో లభించే సామగ్రి ఆధారంగా వెసులుబాటు కల్పించారు.

అధికారులు దౌర్జన్యం చేశారని ఫిర్యాదు


అటవీ శాఖ కన్జర్వేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోటపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిన్నారం గ్రామంలో బీజేపీ బూత్ అధ్యక్షుడు, రైతు సుంకె నగేష్ ఇంట్లో స్థానిక అటవీ అదికారులు చొరబడి బీభత్సం సృ ష్టించారని శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు అటవీ శాఖ కన్జర్వేటర్ శాంతారాంకు ఫిర్యాదు చేశారు. నగేష్ తండ్రి 30 ఏళ్లుగా పోడు సాగు చేశాడు. అదే భూమిలో నగేష్ సైతం సాగు చేస్తున్నాడు. అయి తే నగేష్ ప్రస్తుతం బీజేపీలో ఉండడంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు స్థానిక అట వీ అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేశారు. దీంతో వారు నగేష్ ఇంట్లో చొరబడి ఇష్టం వచ్చినట్లు తిట్టడంతో పాటు ట్రాక్టర్‌ను తీసుకువెళ్లేందుకు సిద్ధమయ్యారని, తాము ఆందోళన చేయడంతోనే విరమించుకుని వెళ్లారని దీనిపై పూర్తి విచారణ జరిపి సదరు రైతుకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ దుర్గం అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి రామయ్య, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శంకర్, బాధితుడు సుంకె నగేష్ పాల్గొన్నారు.

బెంచిపై కూర్చుని అక్కడే ప్రాణాలు వదిలి..

గుండెపోటుతో వృద్ధుడి మృతి


మృతి చెందిన మల్లయ్య

కోటపల్లి,మే 9 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు పని నిమిత్తం వచ్చి వృద్ధుడు రోడ్డు పక్కన ప్రయాణికులు కూర్చు నేందుకు ఏర్పాటు చేసిన సిమెంటు బెంచిపై కూర్చుని హఠాత్తుగా ప్రాణాలు వదిలాడు. మండలంలోని సూపాక గ్రామానికి చెందిన నల్లగొంట మల్లయ్య (77) శుక్రవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ముందు ఉన్న సిమెంటు బెంచిపై కూర్చుని మృత్యువాత పడ్డాడు. మల్లయ్య కుమారుడు శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన మల్లయ్య కోటపల్లికి బ్యాంకు పని నిమిత్తం వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పాడు. సూపాక నుంచి కోటపల్లికి వచ్చిన మల్లయ్య బస్సు దిగి ప్రయాణికులు కూర్చునే బెంచిపై కూర్చుని మృతిచెందినట్లు కుటుంబ సభ్యులకు ఉదయం 10 గంటలకు సమాచారం అందించారు. మల్లయ్య మృతి చెందింది గుండెనొప్పితోనా లేక వడదెబ్బ తోనా అనేది తెలియడం లేదు. వైద్యులు పరీక్షించి గుండెనొప్పి అని ప్రాథమికంగా నిర్ధారించారు. పోస్టుమార్టం రిపోర్టు వస్తే కానీ మృతికి కారణాలు తెలియదని ఆ తర్వాత చెబుతామని ఎస్ఐ రాజేందర్ పేర్కొన్నారు. కుమారుని ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైద్య సేవలపై దృష్టి సారించాలి

ఆసిఫాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాన్ కమ్యూనబుల్ డిసీజ్ వ్యాధిగ్రస్తులకు నిర్వహించే పరీక్షలు, అందించే వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి సీతారాం అన్నారు. జిల్లా కేంద్రంలోని వైద్యాధికారులకు, సూపర్‌వైర్లకు, సిబ్బందికి ఎన్‌సీడీ వ్యాధిగ్రస్తులకు నిర్వహించే పరీక్షలు, అందించే వైద్య సేవలపై ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్‌తో కలిసి శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ నాన్ కమ్యూనబుల్ డిసీస్ వ్యాధిగ్రస్తులకు క్రమ పద్ధతిలో వైద్య సేవలు అందించాలని చెప్పారు. సరైన సమయంలో మాత్రలు ఇవ్వాలని తెలిపారు. సికిల్‌సెల్ ప్రోగ్రాంలో భాగంగా మండల పరిధిలోని గిరిజన గ్రామాలలో సికిల్‌సెల్ స్ర్కీనింగ్ చేయించాలని అధికారులకు సూచించారు. సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలని డీహెంచ్‌వో సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్‌సీడీ విభాగం అధికారి, వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను గుర్తించాలి


మాట్లాడుతున్న ఎంఈవో వాసాల ప్రభాకర్

కాగజ్‌నగర్ టౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేరేలా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కాగజ్‌నగర్ ఎంఈవో వాసాల ప్రభాకర్, సీఎంవో మధూకర్ అన్నారు. స్థానిక సర్‌సిల్క్‌లోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీరో, తక్కువ ఎన్‌రోల్‌మెంట్ స్కూల్స్ ఉపాధ్యాయులు ప్రతీ శుక్రవారం సమావేశానికి హాజరు కావాలన్నారు. జూన్‌లో పాఠశాలలు ప్రారంభించే నాటికి బడిబాట కార్యక్రమంలో పిల్లలు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందించే సౌకర్యాలను వివరించాలని తెలిపారు.

కాంగ్రెస్‌తోనే మహిళలకు రాజకీయ అవకాశాలు



మాట్లాడుతున్న తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల

కెరమెరి, మే 9 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రాజకీయ అవకాశాలు ఎక్కువగా కల్పించింది కాంగ్రెస్ పార్టీనే అని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల అన్నారు. మండలంలోని ఝరి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఇందిర ఫెలోషిప్ రాజకీయ సమ్మేళన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు నేటి సమాజంలో పురుషులతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా రాజకీ యంగా, ఆర్థికంగా, విద్యా సామాజిక రంగాల్లో ముందుండాలని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మహిళలు క్కువగా పోటీ చేసి విజయం సాధించాలన్నారు. మహిళలు ఒక్కొక్క రూపాయి కూడబెట్టుకొని ఆర్థిక స్వావలంబన సాధిస్తారని చెప్పారు. పురుషులు డబ్బులు విపరీతంగా ఖర్చు పెడతారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎంతో మంది మహిళలు రాజకీయంగా ఉన్నత పదువులు పొందారని చెప్పారు. అనంతరం భీం పోరుగడ్డ జోడేఘాట్ గ్రామాన్ని సందర్శించారు. అక్కడ భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇందిర ఫెలోషి ప్ రాష్ట్ర కోఆర్డినేటర్ సౌజన్య, ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ సుగుణక్క, డీసీసీ అధ్యక్షుడు ప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకులు ఇందిరా, కుసుం రావ్, శ్రీనివాస్, మునీర్ అహ్మద్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలి పారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులలో 40 చొప్పున 160 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం ఎంపిక చేయనున్నామని తెలిపారు. ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని, 26న ఎంపిక జాబితా విడుదల చేస్తామని పేర్కొన్నారు. 27 నుంచి 31 వరకు ధ్రువపత్రాల పరిశీలించి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు..

ఆసిఫాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అకాడమి ఆఫ్ లాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్(తాలిమ్) నుంచి లైసెన్సు సర్వేయర్ శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కలెక్టర్ వెంకటేష్ దోత్రే శుక్రవారంఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తెలంగాణలోని అన్ని మీ సేవ కేంద్రాలలో లైసెన్సు సర్వే శిక్షణ కార్యక్రమానికి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాలలో మొత్తం 50 రోజులు శిక్షణ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్ (గణిత శాస్త్రం ఒక అంశంగా ఉండాలి) కనీసం 60 శాతం మార్కులు, ఐటీఐ డ్రాఫ్ట్ మెన్(సివిల్), డిప్లొమా (సివిల్), బి.టెక్(సివిల్) లేదా ఇతర సమానమైన అర్హత ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులు ఈ నెల 5 నుంచి 17 వరకు మీ సేవా కేంద్రాలలో రూ.100 చెల్లించి పొందవచ్చని కలెక్టర్ సూచించారు.

యువత రక్తదానం చేయాలి

ఆసిఫాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలువాలని జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రి సూపరింటెండ్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ఈ నెల 12న అంతర్జాతీయ నర్సెస్ డేని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల మనిషి ఆరోగ్యానికి ఎలంటి హాని కలగదని చెప్పారు. తద్వారా ఇతరులకు ప్రాణదాతగా నిలిచిన వారమవుతారన్నారు. నర్సెస్ డేని పురస్కరించుకుని స్టాఫ్ నర్సుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో 15 మంది పాల్గొని ఒక్కో యూనిట్ చొప్పున 15 యూనిట్ల రక్తదానం చేసినట్లు వివరించారు. యువతకు రక్తదానం చేయడంపై అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సుల సూప రింటెండెంట్ ఇందుమతి, హెడ్ నర్సులు ఏసుకరణ, సఫియా, కుసుమ, స్టాఫ్ నర్సులు శ్రీదేవి, పద్మ, సృజన, సునీత, సుమిత్ర, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిని సందర్శించి.. రికార్డులు పరిశీలించి..


గర్భిణులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం అడ గ్రామ పంచా యతీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ వెంకటేష్ దోత్రే శుక్రవారం సందర్శించి వార్డులు, హాజరు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముందస్తు అనుమతి లేకుండా వైద్యులు, సిబ్బంది విధులకు గైర్హాజరు కాకూడదని చెప్పారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. నెల వారిగా పరీక్షలకు వచ్చే గర్భిణులను అంబులెన్స్ ద్వారా తీసుకు రావాలన్నారు. గర్భిణులు సమయానుసారంగా అవసరమైన పరీక్షలు చేయించుకోవడంతో పాటు సరైన పోషకాహారం, మందులు తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త పాటించాలని తెలిపారు. అంతకు ముందు అడ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సరీలోని మొక్కలు ఎండి పోకుండా ప్రతి రోజు సకాలంలో నీటిని అందించాలని, పశువులు రాకుండా రక్షణ చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశిం చారు. అనంతరం అడ గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలో వార్డులు, హాజరు రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం గ్రామంలో రూర్బన్ పథకం కింద నిర్మిస్తున్న సామూహిక మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. జూన్ నెలా ఖరు లోగా కల్లా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వచ్చే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.



శాంతిఖని గనిని సందర్శించిన జీఎం


శాంతిఖని గనిని పరిశీలిస్తున్న జీఎం దేవేందర్

బెల్లంపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): శాంతిఖని గనిని శుక్రవారం మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భూగర్భ గనిలో ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించేందుకు జీఎం సందర్శించారు. అనంతరం బొగ్గు ఉత్పత్తి, గని పరిస్థితి, కార్మికుల విధులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, ఏజెంట్ అబ్దుల్‌ఖదీర్, గని రక్షణ అధికారి రాజు, సంక్షేమాధికారి రవికుమార్ పాల్గొన్నారు.

కేంద్రం కార్మికుల హక్కులను కాలరాస్తోంది

కాసిపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కొత్త చట్టాలు తీసుకొస్తోందని సీఐటీయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్ అన్నారు. కాసిపేట 1వ గనిపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగులేబర్ కోడ్‌లలో అతి ముఖ్యమైనది కార్మికుల హక్కును కాలరాస్తుందన్నారు. దీనిని తిప్పికొట్టేందుకు ఈనెల 20న దేశవ్యాప్త సమ్మె చేస్తున్నామన్నారు. అందుకే కార్మిక సంఘాలన్ని సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కొత్తగా వచ్చే లేబర్ కోడ్‌లు అమలైతే కార్మికులకు సంస్థలో ఓటీలు ఇవ్వకుండా 12గంటల వరకు పని చేయిం చుకునే అవకాశం ఉంది. వీటన్నింటిపై పోరాటం చేసేందుకు కార్మికులందరూ తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్రాంచి అధ్యక్ష కార్యదర్శులు ఎస్. వెంకటస్వామి, అల్లీ రాజేందర్, నాగెల్లి శ్రీధర్, సురేశ్, మల్లేశ్, నాగరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి పథకం అమలు చేయాలి


మంత్రికి సమస్యలు వివరిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్/మందమర్రిటౌన్, మే 9 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు సొంతిం టి పథకం అమలు చేయాలని ఐఎన్‌టీయూ ఎ సెక్రటరీ జనరల్ బి జనక్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర హౌసింగ్, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సింగరేణి సీఎండీ ఎన్ బలరాంను శుక్రవారం యూని యన్ ప్రతినిధులతో కలిసి విన్నవించారు. పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మాఫీ చేయాలని కోరారు. కార్పొరేట్ మెడికల్ బోర్డు మార్పు, మెడికల్ అటెండెన్స్ నిబంధనల్లో సవరణ, డిస్మిసల్ కార్మికుల సమస్య పరిష్కారం, హైదరాబాద్‌లో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం, సింగరేణి ద్వారా ఐటీ కంపెనీ స్థాపన, అనుబంధ పరిశ్రమల ఏర్పాటు వంటి అంశాలను ప్రస్తావించారు. 3,700 కంటే ఎక్కువగా ఉన్న ఉద్యోగ సంబంధిత సమస్యల పరిష్కారానికి ఒకే విడతలో లోక్ అదాలత్ నిర్వహించాలని సీఎండీ ఎన్ బలరాంను కోరారు. సింగరేణి కార్మికుల కోసం సొంతింటి పథకం త్వరగా అమలు చేయాలని మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి విన్నవించారు. బృందంలో కేంద్ర ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, ధర్మపురి, త్యాగరాజన్, కాంపల్లి సమ్మయ్య, జెట్టి శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శులు వికాస్ కుమార్ యాదవ్, రాజేందర్, అక్రమ్, మహిళా అధ్యక్షురాలు శేషారత్నం, అన్ని ఏరియాల ఉపాధ్యక్షులు ఉన్నారు.

సింగరేణిలో వారసత్వ ఉద్యోగాలు ఇప్పించాం


మాట్లాడుతున్న టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి, పాల్గొన్న యూనియన్ నాయకులు

శ్రీరాంపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంఘాలు రెండు దశాబ్దాల క్రితం పోగొట్టిన వారసత్వ ఉద్యోగాలను కారుణ్య నియామకాల పేరిట ఇప్పించిన ఘనత టీబీజీకేఎస్‌దేనని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. ఎస్ఆర్‌పీ 3, 3ఏ గనులపై బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిం చిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఇతర సంఘాలు కాని ఎన్నో హక్కులను తాము సాధించామని తెలిపారు. కారుణ్య నియామకాలతో నేడు 15 వేల మంది యువతీ, యువకులు సింగరేణిలో పనిచేస్తున్నారన్నారు. ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ద్వారా ఐదు వేల మంది పనిచేస్తున్నారని చెప్పారు. లేనిపక్షంలో ఈనాడు సింగరేణిలో 20 వేల మంది పర్మనెంట్ కార్మికులు మాత్రమే మిగిలేవారని చెప్పారు. మహిళలకు ఉద్యోగాలు, రూ.10లక్షల ఇంటి రుణం, తల్లిదండ్రులకు కార్పొరేట్ వైద్యం, 16 శాతం నుంచి 32 శాతం వరకు లాభాల వాటా వంటి ఎన్నింటినో సాధించినట్లు వివరించారు. అనంతరం వివిధ యూనియన్లకు చెందిన 80 మంది కార్మికులు టీబీజీకేఎస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శి బండి రమేష్, కార్యదర్శి పానుగంటి సత్తయ్య, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్వేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ భీమిరెడ్డి నర్సింహారెడ్డి సేవలు మరువలేనివి

బెల్లంపల్లి, మే9(ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ భీమిరెడ్డి నర్సింహారెడ్డి ప్రజాజీవితానికి అంకితమయ్యారని ఆయన సేవలు మరువలేనివని ఎంసీపీఐయు జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్ర ప్రసాద్, సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేశ్‌లు అన్నారు. శుక్రవారం కామ్రేడ్ భీమిరెడ్డి నర్సింహారెడ్డి వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్, సతీష్‌లు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

బెల్లంపల్లి, మే9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి మేకల దాసు అన్నారు. శుక్రవారం పట్టణంలో సార్వత్రిక సమ్మె పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలనే ప్రధాన డిమాండ్లతో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేపడుతున్నామన్నారు. ఈ సమ్మెకు జిల్లాలోని అన్ని వర్గాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, ఆడెపు రాజమౌళి, హమాలీ కార్మికులు చంద్రశేఖర్, నరేశ్, సతీష్, రమేశ్, రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నవజాతా కవలలకు మెరుగైన వైద్యం

మంచిర్యాలక్రైం, మే9 (ఆంధ్రజ్యోతి): నెలలు నిండక ముందే అతితక్కువ బరువుతో జన్మించిన నవజాత కవల పిల్లలకు అవని ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ రుద్రభట్ల రఘువంశీ మెరుగైన వైద్యం అందించారు. అచ్చలాపూర్‌కు చెందిన కృష్ణవేణికి 13 ఏళ్లకు కాన్పు అయింది. కవలలు అతి తక్కువ బరువుతో జన్మించి శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది తలెత్తింది. 34 రోజుల పాటు మెరుగైన వైద్యం అందించి ఆరోగ్య పరిస్థితి మెరుగు పర్చారు. నవజాత పిల్లలకు వైద్యం అందించిన వైద్యున్ని పలువురు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కన్నెపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జజ్జరవెల్లి వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు ఎస్ఐ గంగారాం తెలిపారు. నలుగురు ట్రాక్టర్ యాజమానులపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమతులు ఇసుక, మట్టిని తరలిస్తే కఠిన చర్యలుంటాయన్నారు.

వేసవిలో పశువులను కాపాడుకుందాం

- అధిక ఉష్ణోగ్రతలతో వడదెబ్బ ముప్పు
- జాగ్రత్తలు పాటించాలని నిపుణుల సూచన



నెన్నెల, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఎండలు మండిపోతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల ప్రభావానికి పశువులు అల్లాడిపోతున్నాయి. వేసవికాలంలో మూగజీవాల పట్ల సరైన శ్రద్ధ తీసుకోకపోతే అధిక తాపానికి గురై అస్వస్థతకు గురవుతాయి. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోతుంది. వడదెబ్బకు గురైన పశువులు ఒక్కో సారి మృత్యువాత పడే ప్రమాదం కూడా ఉంటుంది. వేసవి కాలంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటే మూగ జీవాలు అనారోగ్యానికి గురికాకుండ సంరక్షించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

ఇవీ ముందు జాగ్రత్తలు

పశువులను ఉదయం పది గంటల వరకే మేతకు పంపించాలి. ఎండతీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి మధ్యాహ్నం వేళ పశువులను బయటికి పంపకూడదు. మళ్లీ సాయంత్రం 4 గంటల తరువాత ఆరుబయటికి పంపవచ్చు. పశువులను పాకల్లో ఉంచి పచ్చిమేత, దాణాను మేపాలి. పశు గ్రాసాలను చిన్నముక్కలుగా చేసి మేపాలి. నీటి వసతిగల రైతులు పశుగ్రాసాలను సాగు చేసుకుంటే ఎండాకాలంలో కూడా పశువులకు పచ్చిమే తను మేపుకోవచ్చు. ఎండుగడ్డిని యూరియా ద్రావణంతో తడిపి సైలేజ్ చేసి ఇవ్వాలి. ఈ గడ్డిని పశువులు ఇష్టంగా తింటాయి. పాడి పశువుల్లో పాలదిగుబడి తగ్గకుండా పచ్చిమేతతో పాటు సమీకృత దాణా మిశ్రమాన్ని, ఖనిజలవన మిశ్రమాన్ని కలిపి మేపాలి.

సాధారణంగా ఎండాకాలంలో పశువులు ఎక్కువ నీరు తాగి తక్కువ మేత తీసుకుంటాయి. కాబట్టి ఇచ్చే మేతలో పోషక విలువలు ముఖ్యంగా మాంసకృత్తులు విటమిన్లు ఖనిజ లవణాలు, కొవ్వు పదార్థాలు తగు పాళ్లలో ఉండే విధంగా చూసుకోవాలి. ఎండ తీవ్రత నుంచి పశువులను రక్షించేందుకు పాకల్లో గాలి, వెలుతురు ఉండే విధంగా పాకల ఎత్తు సుమారు 12 అడుగుల ఉండేలా చూసుకోవాలి. పాకలకు రెండు వైపుల ఉండే గోడలను పూర్తిగా కట్టకుండా నాలుగు నుంచి ఆరు అడుగుల ఎత్తు వరకు నిర్మించాలి. పాకలకు ఇరు వైపుల నీడనిచ్చే చెట్లను పెంచాలి. సుబాబుల్, అవిస లాంటి చెట్లను పెంచితే నీడ నివ్వడంతో పాటు ఎండాకాలంలో పశుగ్రాసంగా కూడా ఉపయోగపడతాయి. పాకలకు ఇరువైపు గోనె సంచులను వేడాలదీసి నీటితో రెండు మూడు సార్లు తడపాలి. పాకల్లో ఫ్యాన్లు, కూలర్లను అమర్చడం ద్వారా ఎండ వేడిని తగ్గించవచ్చు. పాకల పైన తుంగ, వరిగడ్డి లాంటి వాటితో కప్పితే ఉష్ణోగ్రత తగ్గుతుంది. పశువులు ఎక్కువగా ఉన్న వారు స్ప్రింక్లర్లతో నీటి తుంపర్లు పశువులపై పడేట్లు అమర్చుకుంటే మంచిది. పశువులకు సౌకర్య వంతంగా ఉంటుంది. ఇంతే కాకుండా పశువులను రోజుకు రెండుమూడు సార్లు తడపుతూ ఉండాలి.

పశువులను అధిక ఉష్ణోగ్రతల నుంచి కాపాడుకోవాలి

డాక్టర్ కె. సంపత్, పశు వైద్యాధికారి, నెన్నెల

ఎండాకాలంలో పశువులను అధిక ఉష్ణోగ్రతల నుంచి కాపాడుకోవాలి. లేకపోతే వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుంది. కొన్ని ముందు జాగ్రత్తలు తీసుకుంటే వేసవిలో పశువులను వడదెబ్బ ముప్పునుంచి కాపాడుకోవచ్చు. మధ్యాహ్నం పూట ఎట్టిపరిస్థితుల్లో పశువులు బయటకు వెళ్లకుండా చూసుకోవాలి. వడదెబ్బకు గురైనట్లు గుర్తించిన వెంటనే నీడ ప్రదేశానికి తీసుకెళ్లి చల్లటి వాతావరణంలో తగిన విశ్రాంతినివ్వాలి. వెంటనే పశువైద్యులను సంప్రదించి వైద్యం అందే ఏర్పాట్లు చేయాలి. పశువులు డిహైడ్రేషన్‌కు గురై నీరసించిపోతాయి కాబట్టి తక్షణమే తగిన వైద్యం చేయాల్సి ఉంటుంది.

వడదెబ్బకు గురైన పశువులను గుర్తించి వెంటనే చికిత్స చేయించాలి. లేకపోతే ప్రాణాలకే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంటుంది. వడదెబ్బకు గురైన పశువుల్లో శరీర ఉష్ణోగ్రత 101 నుంచి 108 డిగ్రీల ఫారన్‌హీట్ వరకు పెరుగుతుంది. చెమట ఎక్కువగా బయటకు రావడం, దాహం అధికంగా ఉండటం, మేత సరిగ్గా మేయకపోవడం, శ్వాస కష్టంగా ఉండటాన్ని గమనించవచ్చు. నోటి నుంచి చొంగ కారడం, నెమరు వేయడానికి తగిన లాలాజలం తగ్గి జీర్ణప్రక్రియ కుంటుపడుతుంది. ఆకలి మందగించడంతో మేత పైన ఆసక్తి చూపవు. తాగిన నీరు కూడా చెమట రూపంలో బయటకు రావడం వలన లవణాలు నష్టపోయి డిహైడ్రేషన్‌కు లోనవు తాయి. రక్తంలో గ్లూకోజు తగ్గి, పశువులు శక్తిని కోల్పోయి క్రమంగా నీరసించి బలహీనమవుతాయి. ఈ పరిస్థితి ఎక్కువైతే పశువులు సరిగ్గా నడవలేక తుళ్లుతూ నడుస్తాయి.

గుర్తించడం ఇలా...

ఒక్కో సారి స్పృహ కోల్పోతాయి. చర్మం ఎండిపోయినట్లు ఉంటుంది. పాడి పశువుల్లో పాల ఉత్పత్తి కోల్పోతుంది. ఇటువంటి లక్షణాలున్న పశువులను వడదెబ్బ తగిలినట్లు గుర్తించి, నీడ ఉండే చల్లటి ప్రదేశానికి తీసుకెళ్లాలి. శరీరం అంతటిని నీటిలో ముంచిన చల్లటి వస్త్రంతో తుడవాలి. చల్లని నీరుతాగించాలి. ఐస్ ముక్కలు అందుబాటులో ఉంటే నుదుటిమీద ఉంచాలి. వెంటనే పశువైద్యుడిని సంప్రదించి తగిన వైద్యం అందించాలి. తేలికగా జీర్ణమయ్యే జావ, గంజిలో ఉప్పును తగిన మోతాదులో కలిపి ఆహారంగా ఇవ్వాలి. విటమిన్ ఎ, డి, కె, సి, బి కాంప్లెక్సు ఇంజెక్షన్లు ఇప్పించాలి. గొంతువాపు, జబ్బువాపు వ్యాధులు సోకకుండా ముందు జాగ్రత్తగా టీకాలను ఇప్పించాలి. చెరువులో కాని కుంటల్లో కాని తేలి ఎక్కువ సేపు నీటిలో ఉండేలా చూడాలి. ఈ విధంగా చేయడం వల్లా అధిక ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం కలిగించవచ్చు.



అకాల వర్షం..అపార నష్టం

(5వ పేజీ తరువాయి)

నెన్నెల, జైపూర్, భీమారం, బెల్లంపల్లి, తాండూరు, మందమర్రి మండలాల్లో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ఆయా మండలాల్లోని 1814 మంది రైతులకు సంబంధించిన 3713 ఎకరాల్లో మామిడి పంట నేలరాలింది.

● వేగం పుంజుకున్న కొనుగోళ్లు...

అకాల వర్షాల కారణంగా అన్నదాతకు అపార నష్టం వాటిల్లడం, మరిన్ని అకాల వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అప్రమత్తమైన అధికారులు ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచారు. జిల్లాలో ఏర్పాటు చేయాలనుకున్న 361 కొనుగోలు కేంద్రాలకు గాను నేటికి 345 ప్రారంభించి కొనుగోళ్లు వేగవంతం చేశారు. ఇప్పటి వరకు 242 కేంద్రాల ద్వారా 59,500 టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అలాగే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి పోకుండా వెంట వెంటనే కాంటా వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని సైతం ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించి నిలువ చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు అంచనా వేసిన ప్రకారం యాసంగి సీజన్‌లో 3,40,301 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుంది. అందులో ప్రైవేటు మార్కెట్లో విక్రయించడం, తాలు, తప్ప పోను కనీసం రెండు లక్షల పైచిలుకు మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించాల్సి ఉంది. ఇందులో కేవలం 50వేలపై చిలుకు టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ఇంకా మూడు వంతుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. ముందుగా నిర్ణయించినట్లు జిల్లా వ్యాప్తంగా 361 కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా, నెల రోజులు గడుస్తున్నా.. ఇంత వరకు పూర్తి స్థాయిలో సెంటర్లు ఏర్పాటు కాలేదు. మరోవైపు జిల్లాలో ప్రారంభించిన 345 సెంటర్లలో 242 కేంద్రాల్లోనే కొనుగోలు జరుగుతున్నాయి. మిగతా చోట్ల ఇంకా కొనుగోళ్లు ప్రారంభించలేదు. ఈ కారణంగానూ అకాల వర్షాలకు ధాన్యానికి పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లింది.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలి



ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకుడు

బెల్లంపల్లి, మే9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా చేపట్టాలని శుక్రవారం ఆర్డీవో హరిక్రిష్ణకు సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టణంలోని 34 వార్డుల్లో కొందరు అధికార పార్టీ నాయకులు ఇష్టారాజ్యంగా అనర్హులను ఎంపిక చేశారన్నారు. పార్టీ నాయకులకు, వారి బంధువులకు పెద్దపీట వేస్తూ ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో చేర్చారన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో వార్డు సభలు ఏర్పాటు చేసి అర్హులైన వారిని ఇందిరమ్మ ఇళ్లకు కేటాయించాలన్నారు. ఎంపిక చేసిన వారి పేర్లను మున్సిపల్ కార్యాలయం ముందు నోటీసు బోర్డులో ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, జిల్లా కార్యవర్గ సభ్యులు సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, నాయకులు చంద్రశేఖర్, సతీష్, నరేశ్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, మే9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య నివారణ కోసం ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డులను మున్సిపల్ కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. తడిపొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని అధికారులకు సూచించారు. ఇంటి సమీపాలలో చెత్త వేయకుండా పలు చర్యలు తీసుకోవాలని, మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని పేర్కొన్నారు. అనంతరం అమృత్ 2.0లో భాగంగా ఎల్లంపల్లి టూ బెల్లంపల్లి గోదావరి నీటి సరఫరాకు సంబంధించి పనులను పరిశీలించారు. పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన నిందితుల అరెస్ట్

వేమనపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బద్దంపల్లి అటవీ బీట్ పరిధిలో అమర్చిన టైగర్ ట్రాకింగ్ సీసీ కెమెరాలను ధ్వంసం చేసిన నలుగురిని అరెస్టు చేసినట్లు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్ర వారం నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్ల డించారు. బద్దంపల్లి రిజర్వు ఫారెస్టులో జంతువులు, పులుల ట్రాకింగ్ కోసం మార్చి 10న నాలుగు కెమెరానలు అటవీ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. మార్చి 25న కెమెరాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించడంతో అటవీ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేపట్టగా దర్యాప్తులో బొమ్మెన గ్రామానికి చెందిన ఓలా తిరుపతిని పట్టుకుని విచారించారు. విచారణలో ఓలా తిరుపతి, మానేపల్లి సమ్మయ్య, బట్టు కిష్టయ్య, మడే భీమయ్య కలిసి అడవుల్లో బ్యాటరీ లైట్‌తో వన్యప్రాణులను వేటాడుతుండేవాడు. ఈ క్రమంలో అందరు మార్చి 20న రాత్రి బద్దంపల్లి ఫారెస్టులోకి వెళ్లి అటవీ జంతువులను వేటాడుతుండగా చెట్లకు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలను దొంగిలించి తిరుపతి ఇంట్లో దాచి పెట్టారు. అనంతరం మైలారం అడవుల్లో వేటాడేందుకు వెళ్లి అక్కడ కూడా రెండు కెమెరాలను ధ్వంసం చేసినట్లు ఏసీపీ తెలిపారు. నలుగురు నిందితులను శుక్రవారం అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద నుంచి కెమెరాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ పాల్గొన్నారు.

టీడీపీ మండల అధ్యక్షుడిగా విజయ్

జన్నారం, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండల టీడీపీ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా ఉప్పుల విజయ్, ప్రధాన కార్యదర్శిగా గొల్లపల్లి ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. నాయకులు ఆనంద్, ఆత్మారాం, శ్రీను, విజయ్, రాము, ప్రసాద్, పద్మారావు, నవీన్, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దహెగాం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నరాస్పెల్లి ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప కేంద్రం పరిధిలోని చిన్నరాస్పెల్లి, అమర్‌గొండ, ఒడ్డుగూడ, బ్రాహ్మణచిచ్చాల, గెర్రె, గిరివెల్లి, ఖర్జీ, లోహ, రాంపూర్, టిప్పర్‌గాం, మొట్లగూడెం, రావులపల్లి, దిగిడ గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని తెలిపారు.

భారత సైన్యానికి మద్దతుగా ఆలయాల్లో పూజలు

బెల్లంపల్లి, మే9(ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్థాన్‌తో జరుగుతున్న యుద్ధంలో భారత్ విజయం సాధించాలని ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని శుక్రవారం బుగ్గారాజరాజేశ్వర దేవాలయంలో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలతో పాటు హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా, జైషేమహ్మద్ ఉగ్రవాద సంస్థలకు చెందిన వారని హిందువులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఈ యుద్ధంలో భారత్ విజయం సాధించి ఆర్మీ జవాన్లకు, దేశ ప్రజలకు ఎలాంటి హాని కలుగవద్దని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హేమాజీ, ఆలయ కార్యనిర్వహణ బాపురెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి పాల్గొన్నారు.

దండేపల్లి: గూడెం సత్యనారాయణస్వామి దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు సత్యదేవుడి ప్రధానాలయంలో ఆలయ వేదపండితులు, అర్చకులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆపరేషన్ సింధూర్‌లో విజయవంతం సాధించాలని భారత సైన్యానికి మద్దతుగా ప్రత్యేక పూజలు చేసిన్నట్లు ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిన్నారు.

జైపూర్ : మండలంలోని వేలాల మల్లికార్జున స్వామి ఆలయంలో ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావాలని, దేశ రక్షణ కోసం పోరాడుతున్న భారత సైనికులు క్షేమంగా ఉండాలని శుక్రవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు లక్ష్మణ్, డేగ నగేష్, రాజేష్ పాల్గొన్నారు.





బెల్లంపల్లి, గూడెం ఆలయాల్లో పూజలు చేస్తున్న భక్తులు

కాలం చెల్లిన శీతల పానీయాలు తాగి.. చిన్నారులకు అస్వస్థత

లక్షెట్టిపేట, మే 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గోదావరి రోడ్డుకు చెందిన ఇద్దరు చిన్నారులు కాలం చెల్లిన శీతల పానీయాలు తాగి అస్వస్థతగు గురయ్యారు. గోదావరి రోడ్డుకు చెందిన ఒక కిరాణ దుకాణంలో ఒక వ్యక్తి మూడు శీతలపానీయాలు కొన్నాడు. వాటిని ఇంటికి తీసుకువెళ్లి పిల్లలకు తాగించడంతో పిల్లలు వాంతులు చేసుకోవడం గమనించి తాను కొన్న శీతలపానియాలపై తయారీ సమయం చూడగా అవి కాలం చెల్లినవిగా గుర్తించాడు.

వెంటనే బాదితుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు దుకాణం యజమానిని నిలదీసారు. గతంలో కూడా పలు మార్లు ఇదే దుకా ణంలో కాలం చెల్లిన సామాగ్రి అమ్ముతున్న ఎవరు ప ట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆందోళన చేసారు. ఎస్సై సురేష్ సిబ్బందితో వచ్చి ఆందోళన కారులకు నచ్చజెప్పడంతో పాటు దుకాణంకు తాళం వేసి ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫుడ్‌షేఫ్టీ అ ధికారుల నివేదిక ప్రకారం దుకాణంపై చర్యలు తీసు కుంటామని ఎస్సై వెల్లడించారు.

పూజలు చేసి పంటను కోసి..

చెన్నూరు, మే 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగాపూర్ గ్రామానికి చెందిన అన్నల తిరుపతి అనే రైతు మొట్టమొదటగా చేతికి వచ్చిన ఆయిల్ ఫాం పంట తీయడాన్ని పండగలా నిర్వహించారు. సదరు రైతు ఆరు ఎకరాల్లో మూడేండ్ల క్రితం ఆయిల్‌ఫాం మొక్కలను నాటారు. ప్రస్తుతం ఫాం ఆయిల్ చెట్లకు పంట చేతికి రావడంతో శుక్రవారం తన చేనులో పూజారులతో ప్రత్యేక పూజలు చేయించి పంట కోతను ప్రారంభించాడు. పంట చేతికి రావడంతో ఆనందం వ్యక్తం చేశాడు. ఈ కార్యక్రమంలో కంపెనీ సీఈవో ఉదయ్‌కుమార్, కంపెనీ ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలి

కాసిపేట, మే9(ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులోకి తరలించాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. శుక్రవారం మల్కపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చేటప్పుడు తేమ శాతాన్ని పరిశీలించుకోవాలన్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. ధాన్యం శుద్ధిమిషన్ యంత్రాన్ని పరిశీలించారు. ధాన్యంలో చెత్త చెదారం ఉంటే ఈ యంత్రం ద్వారా శుద్ధి చేసుకోవచ్చునన్నారు.



మల్కపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

యువ వికాసం లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా నిర్వహించాలి..

యువతకు రుణాలు అందించడంలో అధికారులు పారదర్శకంగా వ్యవహరించి లబ్దిదారుల ఎంపిక చేయాలని అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్న లబ్దిదారుల సిబిల్ స్కోరును ఆధారంగా ఎంపిక చేయాలన్నారు. అలాగే ఒంటరి మహిళ, వితంతువులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎలాంటి అవకతవకలు జరుగకుండా అర్హులైన వారిని ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో మండల ప్రత్యేకాధికారి పురుషోత్తం నాయక్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి దుర్గా ప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ తిరుపతి, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కైసర్ రజా అన్సారీ, యూనియన్ బ్యాంక్ మేనేజర్ దిలీప్ కుమార్, తహసీల్దార్ బోజన్న, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఎంపీవో షేక్ సప్దర్ అలీ,యువ వికాసం కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి

జైపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : జైపూర్ ఎస్టీపీపీలో ఆవరణలో కానీ సమీపంలో కానీ అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే సీఐఎస్ఎఫ్ కంట్రోల్ రూమ్ 83329-74224కు తెలియజేయాలని ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఎస్టీపీపీ కాన్ఫరెన్స్ హాలులో సీఐఎస్ఎఫ్ అధికారులు, ఎస్టీపీపీ ఉన్నతాధి కారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా పోలీసులు, సింగరేణి యాజమాన్యం సూచనల మేరకు ఎస్టీపీపీ ఉద్యోగులందరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ఐడీ కార్డు వెంట ఉం చుకోవాలని, అత్యవసరం అయితే తప్ప ఇంటి నుంచి బయట ప్రాంతాలకు వెళ్లరాదని సూచించారు. పరిస రాల్లో అనుమానితులు అనుమానస్పదంగా కనిపిస్తే సెక్యూ రిటీ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎస్టీపీపీ అధికారులు జేఎన్‌సింగ్, మదన్ మోహన్, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ సంచల్ సర్కార్, అఖిల్ కపూర్, రమేష్‌చంద్ర, అజాదుల్లాఖాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

తాండూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన తాండూర్ మండలంలోని మాదారం చెందిన విద్యార్థులను కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ఇందూరి శృతి 992, పులగం తిరుపతి 901 మార్కులు సాధించారని తెలిపారు. నిరుపేద కుటుంబానికి ఈ ఇద్దరు అత్యధిక మార్కులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుభాష్, దామోదర్‌రెడ్డి, పర్వతిరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ప్రతీ రోజు మొక్కలకు నీరందించాలి

జైపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : నర్సరీల్లోని మొక్కలకు ప్రతి రోజు నీరం దించాలని ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మిట్టపల్లి గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలని, మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. మొక్కలకు సమృద్ధిగా నీరు పోయాలన్నారు. అనంతరం గ్రామానికి మంజూరైన తాగునీటి బోర్‌వెల్‌ను ఏర్పాటు చేయించారు. అనంతరం వేసవి సమ్మర్ క్యాంపును పరిశీలించి పిల్లలు సమ్మర్ క్యాంపునకు హాజరయ్యేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సాయికిరణ్, స్థానికప్రజాప్ర తినిధులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నస్పూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నూతనంగా మంజూరైన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ హైదరాబాద్ 2025- 26 విద్యా సంవత్సరానికి కేటాయించిన 60 సీట్ల భర్తీకి ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులు చేయాలని కరీంనగర్ చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకు లు కె. విద్యాసాగర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. గుండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ హైదరాబాద్ ద్వారా మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సుకు యువత నుంచి దరఖాస్తులు ఆ హ్వానిస్తున్నామన్నారు.

ఈ నెల 16వ తేదీ ఉదయం 11.30 గంటలకు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం కార్యాలయంలో 98493-91548, 8520079865లకు సంప్రదించాలని సూచించారు.





ఉపాధి పనులపై నిఘా

- గ్రామ స్థాయిలో పర్యవేక్షణ కమిటీల ఏర్పాటు
- ప్రతీ పంచాయతీలో ఐదుగురు సభ్యులు
- చర్యలకు ప్రభుత్వం ఉత్తర్వులు

ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గ్రామ పంచాయతీ స్థాయిలో నిఘా పర్యవేక్షణ (విజిలెన్స్ మానిటరింగ్) కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

బెజ్జూరు, మే 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల్లో అవినీతి, దుర్వినియోగానికి తావులేకుండా పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. ఇందుకు అన్ని గ్రామాల్లో నిఘా కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ దిశగా తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. వలసల నివారణకు అన్ని గ్రామాల పరిధిలో కేంద్రం ఉపాధి హామీ పథకాన్ని కొనసాగిస్తున్నారు. పథకంలో అమలులో సాంకేతికత పాటిస్తున్నా పలుచోట్ల అక్రమాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం వీటికి అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది. ఈ ఏడాది పని దినాల సంఖ్యను కుదించి మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని సూచించింది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం జాబ్‌కార్డులు 1,23,505 ఉన్నా యి. కూలీలు 2,44,312 మంది ఉన్నారు. క్రియాశీలకంగా ఉన్న జాబ్‌కార్డులు 92,823, క్రియాశీలకంగా ఉన్న కూలీలు 1,70,303మంది ఉన్నారు.

● అక్రమాలను అరికట్టేందుకు..

ఉపాధి హామీ పథకంలో తరచూ జరుగుతున్న అవినీతి, అక్రమాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన నిఘా కమిటీలతోనైనా అడ్డుకట్ట పడేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ప్రతీసారి నిర్వహించిన సామాజిక తనిఖీల్లో లక్షల రూపాయలు అక్రమాలు జరిగాయని రుజువు చేస్తున్నా అక్రమార్కులపై నామమాత్రపు చర్యలు తీసుకొని చేతులు దులుపేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఉపాధి పనుల్లో ఒకరికి బదులు మరొకరు, అసలు పని చేయకున్నా చేసినట్లు రికార్డుల్లో నమోదు చేసి ప్రభుత్వ డబ్బును కాజేస్తున్నారు. ప్రభుత్వం ఈసారి ఏర్పాటు చేస్తున్న విజిలెన్స్ కమిటీలతోనైనా అక్రమాలకు అడ్డుకట్ట పడనుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

● క్షేత్రస్థాయిలో పర్యటించి..

గ్రామాల్లో కమిటీలు వారానికోసారి క్షేత్ర స్థాయిలో పర్యటించి పనులను పరిశీలిస్తుంది. ఏ మేరకు మంజూరు, కూలీల నమోదు, హాజరు విధానం, వేతనాల చెల్లింపులు తదితర విషయాలను గుర్తించి మండల పరిషత్ అధికారులకు వివరాలు అందిస్తారు. మండల స్థాయి అధికారులు కమిటీల నివేదికలను కలెక్టర్‌కు నివేదిస్తారు. ఆయా పనుల నిర్వహణ తీరును, నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటారు. ప్రతి నెలా మొదటి వారంలో తనిఖీలు నిర్వహించాలని, పనుల వివరాలను అందజేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. తనిఖీల్లో వెల్లడైన రికవరీ నిధులను తాత్సారం చేయకుండా రాబట్టాలని తాజా ఉత్తర్వుల్లో ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి పంచాయతీ కమిటీల్లో ఐదుగురు చొప్పున సభ్యులు ఉండాలని సూచించింది. మండల ప్రత్యేకాధికారి, పంచాయతీ కార్యదర్శి, మహిళా సంఘం సభ్యురాలు, స్వచ్ఛంద సంస్థ సభ్యుడు, ఒక ఉపాధి కూలీ సభ్యులుగా ఉంటారు.

● నామమాత్రంగా సామాజిక తనిఖీలు..

ఉపాధి పనుల నిర్వహణపై ఏటా అన్ని మండలాల పరిధిలో సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. అవకతవకలు బయట పడుతున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. తనిఖీల సమయంలో సస్పెండ్ చేస్తున్నా తిరిగి కొన్నాళ్లకే విధుల్లోకి చేరుతుండడం గమనార్హం. నామమాత్రపు రికవరీలతో సరిపెడుతున్నారు. దీన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పనుల్లో మార్గదర్శకాలు పాటించడం లేదని పని దినాల్లో కోత విధించడం మొదలు పెట్టింది. దీంతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామానికి ఐదుగురితో కూడిన నిఘా కమిటీల ఏర్పాటుకు నిర్ణయించింది.

పనుల్లో పారదర్శకత..

- దత్తారాం, డీఆర్‌డీవో, ఆసిఫాబాద్

ఉపాధి హామీ పథకంలో చేపడుతున్న పనుల్లో పారదర్శకత కోసం గ్రామస్థాయిలో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో పనుల్లో పారదర్శకతతో పాటు అవినీతి, అక్రమాలకు చోటులేకుండా ఉంటుంది. పనుల్లో అక్రమాలు జరిగితే కమిటీలు ఇచ్చిన నివేదికల ఆధారంగా చర్యలు తీసుకుంటాం. ఇక నుంచి ఉపాధి పనులపై నిఘా ఉంటుంది.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ వార్డు నంబరు-1 ఎస్సీ కాలనీలో గల ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలోని లబ్ధిదారుల ఇళ్లను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారుడి ఆదాయం, కుటుంబ నేపథ్యం, రేషన్ కార్డు వంటి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే కేటాయిస్తామని చెప్పారు. అనర్హుల పేర్లు జాబితాలో ఉన్నట్లయితే విచారించి వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం అర్హులకు మాత్రమే ఇళ్లు మంజూరు చేస్తుందని చెప్పారు. ఈ నేపథ్యంలో జాబితాలో గల పేర్లను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, తదితరులు ఉన్నారు.

గంజాయిని నిర్మూలించాలి



పోలీసులకు వేయింగ్ మిషన్ అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): గంజాయి నిర్మూలనకు పోలీసులు కృషి చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాల యంలో పోలీసు అధికారులకు శుక్రవారం వేయింగ్ మిషన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర నిషేధిత మాదకద్రవ్యాలు పూర్తిగా నిషేధించేందుకు జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. యువత, ప్రజలు గంజాయికి అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసగా మారితే, గంజాయి సరఫరా, విక్రయం చేసినట్లయితే 8712670551 లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. గంజాయి రహిత జిల్లా కోసం అధికారులు, ప్రజలు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు రవీందర్, రాణా ప్రతాప్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా

పెంచికలపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా అన్నారు. పెంచికలపేట మండలం పోతెపల్లి ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సును శుక్రవారం ఆమె సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నామని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలు ఉన్న రైతులు నిర్ణీత నమూనాలో దరఖాస్తులను సమర్పించాలన్నారు. ఈ దరఖాస్తుల వివరాలను నమోదు చేసుకుని తక్షణమే పరిష్కరించే దిశగా సంబంధిత అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించే గ్రామాల్లో రెండు రోజుల ముందు నమూనా దరఖాస్తులను పంపిణీ చేస్తామని చెప్పారు. ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యం తీసుకురావాలి



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీవో రాథోడ్ బిక్కు

దహెగాం, మే 9 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని డీసీవో రాథోడ్ బిక్కు అన్నారు. మండలంలోని లగ్గాం, దహెగాంలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. తేమ శాతం 17 వచ్చే వరకు ధాన్యాన్ని ఆరబెట్టాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తే ధాన్యం కొనుగోలు చేసారని చెప్పారు. ప్యాడీక్లీనర్‌లో ధాన్యాన్ని శుద్ధి చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఆర్ శ్యాముూల్, సీఈవో నారాయణ, పీపీసీ ఇన్‌చార్జి జీవన్‌తో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.

పల్లె పాలనలో గ్రామసభల పాత్ర కీలకం



మాట్లాడుతున్న డీపీవో భిక్షపతిగౌడ్

ఆసిఫాబాద్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): పల్లె పాలనలో గ్రామసభల పాత్ర కీలకమైనదని డీపీవో భిక్షపతిగౌడ్ అన్నారు. భారత ప్రభుత్వం పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం, సిబ్బంది, పెన్షన్ల మంత్రిత్వ శాఖ సహకారంతో డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, సమాచార హక్కు, గ్రామసభ కోసం సామర్థ్య, భాగస్వామ్యంతో శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామసభ పాత్ర ముఖ్యమని చెప్పారు. మెరుగైన స్థానిక పాలన కోసం ప్రజల భాగస్వామ్యంతో కూడిన పాలనను ప్రోత్సహించాలన్నారు. సమాచార హక్కు చట్టం, స్వచ్ఛందంగా సమాచారం వెల్లడించడం ద్వారా పారదర్శకతను ప్రోత్సహించాలని చెప్పారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులు, అధికారులు, స్వయం సహాయక బృందాలు, పౌర సమాజ సంస్థలతో సమన్వయంతో గ్రామసభలను బలోపేతం చేయాలన్నారు. మహిళా స్నేహపూర్వక గ్రామపంచాయతీలను ప్రోత్సహిం చడం, మహిళల సాధికారత, బాలల సంరక్షకు సంబంధించిన అంశాలపై శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని డీపీవో తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శులు మహేందర్ రెడ్డి, సీహెచ్ రిషి తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాల్లో కవ్వాలి



కవ్వాలి నిర్వహిస్తున్న కళాకారులు

సిర్పూర్(టి), మే 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రారంభమైన ఉర్సు ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి కళాకారులు కవ్వాలి నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉర్సు ఉత్సవాలు నియోజక వర్గంలోనే అన్ని కులమతాలకు అతీతంగా కొనసాగుతాయన్నారు. అందరికి బాబా ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం కవ్వాలి కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఆయనను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు చాంద్, నాయకులు అబ్దుల్లా, వసీం అహ్మద్, జాహెద్, సమీర్ అహ్మద్ తదితరులు ఉన్నారు. కౌటాల సీఐ రమేశ్, ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

క్రీడా కిట్లు పంపిణీ



క్రీడా కిట్లను పంపిణీ చేస్తున్న ఏసీఎంవో ఉద్ధవ్

ఆసిఫాబాద్‌రూరల్, మే 9(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని క్రీడా పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరానికి శుక్రవారం క్రీడాదుస్తులు, షూస్‌ను ఐటీడీఏ పీడీ ఖుష్బూ గుప్తా, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా డీడీ రమాదేవి ఆదేశాల మేరకు ఏసీఎంవో ఉద్ధవ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్రీడాధికారులు మీనారెడ్డి, జీవరత్నం, ప్రధానోపాధ్యాయుడు జంగు, కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్, పీఈటీ, పీడీలు లక్ష్మణ్, సుందర్‌సింగ్, శ్రీను, పాండు, అరవింద్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

భారత జవాన్లకు మద్దతుగా పూజలు




పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, తదితరులు

ఆసిఫాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత జవాన్లకు మద్దతుగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి పాల్గొన్నారు. ఆలయ అర్చకులు నరేష్ శర్మ, శిరీష్ శర్మలు స్వామి వారికి గణపతి పూజ, శ్రీదేవి, భూదేవి సమేత కేశవనాథ స్వామికి పురుషసూక్త అభిషేకం, మంగళహారతి, మంత్ర పుష్పం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం శత్రుదేశమైన పాకిస్తాన్‌పై మన రక్షణ బలగాలు చేపడుతున్న విరోచిత పోరాటానికి 140 కోట్ల మంది దేశ ప్రజలు మద్దతుగా ఉండాలని చెప్పారు. సైనికులకు, ప్రభుత్వానికి రాజకీయాలకు అతీతంగ అండగా ఉండాల్సిన సమయం ఎంతైనా అవసరం ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా టెర్రరిజం అంతం కావాలని ప్రపంచ దేశాలు సైతం భారత్‌కు మద్దతు ఇవ్వడం శుభసూచిక మన్నారు. ఈ సందర్భంగా భారత్ మాతాకీ జై, జై జవాన్.. జై కిసాన్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో మనోజ్, సుగుణాకర్, విశాల్, శ్రీనివాస్, రవికుమార్ జోషి, శంకర్‌రావు, సురేష్, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ టౌన్, (ఆంధ్రజ్యోతి): భారత జవాన్లకు మద్దతుగా ఎమ్మెల్యే హరీష్‌బాబు ఆధ్వర్యంలో ఈజ్‌గాం శివ మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రైలం, నాయకులు అరుణ్ లోయ, అమిత్ బిశ్వాస్, శివాగౌడ్, హను మంత్‌రావు, చిలువేరు ప్రవీణా, బికాస్ గరామి తదితరులు పాల్గొన్నారు.

సాగు పెరిగేలా.. అవసరాలు తీరేలా..

- కూరగాయల నారు సాగుతో లాభాలు
- ఆసక్తి చూపుతున్న రైతులు



కెరమెరి మండలంలో రైతులు సాగు చేస్తున్న కూరగాయల నారు

కెరమెరి, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు గ్రామాల్లో కూరగాయల సాగు పెరిగింది. దీంతో రైతులకు అవసరమైన కూరగాయలను సాగు చేసేందుకు పలువురు నారు సాగుపై దృష్టి సారించారు. ఇప్పటికే కెరమెరి మండలంలోని సావర్‌ఖేడ, మోడి, నిషాని, సాంగ్వి గ్రామాల్లో రైతులు కూరగాయల పంటల నారు సాగు చేస్తూ తక్కువ సమయంలో మంచి లాభాలు ఆర్జిస్తున్నారు. కొన్ని ఏళ్లకు ముందు ఉట్నూర్, గుడిహత్నూర్‌లో ఆంధ్రప్రాంతానికి చెందిన రైతులు ఉట్నూర్, ఇంద్రవెల్లి ప్రాంతాల్లో నర్సరీలు ఏర్పాటు చేసేవారు. వారి వద్ద నారు కొనుగోలు చేసి మండలంలోని సావర్‌ఖేడ, మోడి, సాంగ్వి, నిషాని గ్రామాల్లో కూరగాయల పంటలు వేసే రైతులు ఈ సారి తమ పంట చేనులలోనే నారు తయారు చేసి విక్రయించేందుకు సిద్ధంగా భూమిని చదును చేసి నర్సరీలను ఏర్పాటు చేస్తున్నారు. అందుకు గాను ఏప్రిల్ నెల ప్రారంభం లోనే భూమిని చదునే చేసి ఏప్రిల్ మొదటి వారంలో విత్తనాలు చల్లుతారు. విత్తనాలకు రెండు రోజుల వ్యవధిలో నీ రు పడతారు. మొక్కలకు సూర్యరశ్మి తగలకుండా పందిర్లు(గ్రీన్‌నెట్) ఏర్పాటు చేస్తారు.

మిర్చి, వంకాయ..

రైతులు టమాట, పచ్చి మిర్చి, వంకాయ, తదితర పంటల విత్తనాలను ఆసిఫాబాద్ నుంచి కొనుగోలు చేసి నారుమళ్లలో చల్లి రెండు నెలల వ్యవధిలో విక్రయాలు ప్రారం భిస్తారు. జూన్ 1 నుంచి నారు విక్రయాలకు డిమాండ్ ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఇలా వంకాయ నారు మొక్కకు రూపాయి, పచ్చి మిర్చి మొక్కకు నాలుగు రూపాయలు, టమాట మొక్క రూపాయికి విక్రయిస్తారు.

రెండు నెలల వ్యవధిలోనే ఆదాయం..



కూరగాయల మొక్కల నారు తయారు చేసి విక్రయించడం వల్ల తక్కువ సమయంలో మంచి ఆదాయం వచ్చింది. జూన్ నెల మొదటి వారం నుంచి వాంకిడి, కెరమెరి, ఆసిఫాబాద్, జైనూరు మండలాల రైతులు ఇక్కడికి నారు కొనుగోళ్లకు వస్తారు. గత ఏడాది రెండు నెలల వ్యవధిలో రూ.80 వేల ఆదాయం వచ్చింది.. ఈ సారి మరింత ఎక్కువగా మొక్కల నారు అందుబాటులో ఉంచాం.

- మోతీరాం, రైతు, సావర్‌ఖేడ

చదువుతోనే గౌరవం



వృద్ధురాలిక అక్షరాలు దిద్దిస్తున్న ఉపాధ్యాయుడు రమేశ్

ఆసిఫాబాద్‌రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): అందరి తలరాతలు మార్చేది చదువు ఒక్కటే అని, దీని వల్లే గౌరవం పెరుగుతుందని కాగజ్‌నగర్ మండలం చారిగాం గ్రామ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుందిళ్ల రమేశ్ అన్నారు. రమేశ్ చేపట్టిన అక్షర చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం పాడిబండ గ్రామ పంచాయతీలో వృద్ధులకు, నిరక్షరాసులకు అక్షరాలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీకటి బతుకులు మా ర్చాలంటే బడీడు పిల్లలందరు నిత్యం బడికి పంపాలని సూచించారు. చదువు ఒక్కటే అందరి తలరాతలను మారుస్తుందని చెప్పారు. చదువుకునే వయస్సులో పిల్లలను బాల కార్మికులుగా మార్చవద్దని, మద్యపానం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఆరోగ్యవంతమైన జీవితంతో ప్రజలు ఆనందంగా ఉండాల న్నారు. మూఢమ్మకాలను విశ్వసంచకూడదని, పర్యావరణమే మనందరి ప్రాణాలకు రక్షణ అన్నారు. బాల్య వివాహలు చేయవద్దని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు వెళ్లాలని చెప్పారు. అనంతరం తన మాట పాటల ద్వారా కంజర వాయిస్తూ ప్రజలకు అర్థమయ్యే సామాన్య భాషలో చైతన్యవంతం చేశారు. అనంతరం ఆయనను గ్రామస్థులు సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రసాద్‌బాబు, గ్రామపటేల్ చందు, అంగన్‌వాడీ టీచర్ రత్నమాల, సిడాం లక్ష్మి, కారోబార్ శైలాష్, మానిక్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దహెగాం ఎస్సైగా విక్రమ్

దహెగాం, మే 9 (ఆంధ్రజ్యోతి): దహెగాం ఎస్సైగా బొల్లం విక్రమ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎస్సై రాజు జిల్లా కేంద్రానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ మండంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు. పేకాట, గుడుంబా విక్రయాలను అరికడుతామని తెలిపారు. ప్రజలు నేరాలు జరుగకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. కొత్త వ్యక్తులు గ్రామాల్లో తిరుగుతున్నట్లు గమనిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. విచారణ జరిపి నేరాలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.